# 1. కాముకి

రాధ ఇంటర్ క్లాసు పెట్టెలో స్థిమితంగా కూర్చొని కిందవున్న భర్తతో మాట్లాడుతూనే ఫ్లాట్‌ఫారం మీదికి తేరిపార చూడసాగింది.

బండి బయలుదేరేందుకు రెండో గంట కూడా కొట్టబడ్డది. దూరాన్నుంచి పరిగెత్తుకొస్తున్న అందమైన సూటు వాలాను కూడా లక్ష్య పెట్టకుండా ఇంజను కూతవేసింది. మెల్లిగా బండి కదిలేప్పటికి అతను ఎక్కగలిగాడు. కింది నుంచి లైసెన్సుకూలీ బండితోపాటే పరుగెత్తుకుంటూ వచ్చి అందిచ్చిన సామాన్ను లాక్కొని కూలి డబ్బుల్ని కిందికి విసిరి వేశాడు.

తను కిటికీలోంచి మూరెడుపొడుగున ముందుకు చాచిన తలనుపట్టి అతను సరిగ్గా తనెక్కిన పెట్టెలోనే ఎక్కి ఉంటాడు. అసలు అతన్ని ఇదివరకు ఆ ఊళ్ళో చాలాసార్లు చూసింది. అతనిపేరు శ్రీపతి అనీ, బి.ఎల్. చదువుతున్నాడని కూడా తనకు తెలుసు...

శ్రీపతి ఎక్కడ కూర్చోటమా అని ఆలోచించాడు. ఆ పెట్టెలో మొత్తం నాలుగుసీట్లు. ఒక సీటులో సాయిబుగారు లేత మధ్యాహ్నాన్ని ప్రభాతం కిందనైనా తీసుకోకుండా నిద్రపోతున్నాడు. మరొకసీటులో నల్లని సాహుకారొకాయన మనిషి ఎత్తు బట్టలమూటను దుకాణంలాగా పరిచి– లెక్క చూచుకుంటున్నాడు. రాధకు ఎదురుగావున్న మూడవ సీటును ఇదివరకే ఎవరో స్నానం చేయించారు. ఇంకా కొంచెం చలిగాలికూడా వీస్తోంది. రాధ కూర్చున్న సీటు ఒకభాగం ఆక్రమించు కోవటమే శ్రీపతికి కర్తవ్యంగా తోచింది. అతను తను కూర్చున్న సీటులోని అవతలి భాగాన జేరటంచూసి– అదంతా తన ఆకర్షణేననే నిశ్చయానికొచ్చింది– రాధ.

శ్రీపతి మెల్లిగా పుస్తకంతీసి చదువులోపడ్డాడు. కృష్ణాబ్రిడ్జిని శబ్దంచేసుకుంటూ దాటిన రైలు మామూలు ధోరణిలో సాగిపోతోంది. అతన్ని ఆకర్షించాలని కాబోలు... రాధ ఒళ్ళంతా కదిలేట్టు సర్దుకు కూర్చుంది. కాని అతనిలో చలనం లేదు.

శ్రీపతి రోజూ తనున్న ఇంటి ముందునుంచే వెళ్ళేవాడు. అతను వచ్చేపొయ్యే వేళల్లో రోజూ తప్పకుండా తను దర్శనం ఇస్తూనే వుంది. ఇద్దరూ ఒకళ్ళను చూసి ఒకళ్ళు నవ్వుకోవటం కూడా- గత ఇరవై రోజుల్నుంచీ గమనించే విషయమే! అసలు అతను తనకు అపరిచితుడు ఎంత మాత్రమూ కాదు. తన ఇంట్లో వ్యక్తి అనే తన భావం!

తన ఆకర్షణకు గురికాని పురుషులు ఇంతవరకూ తనకు ఎదురవలేదు. ఆభరణాల్ని ధరించి అద్దం ముందు నిలబడి, తన ప్రతిబింబాన్ని తనే అభినందించుకున్న ఘట్టాలు తన ఇరవై ఏళ్ళ జీవితంలోనూ అనేకం ఉన్నై. ఆ వీధిలో స్త్రీలందరూ కలిసి అందంలో తనను మొట్టమొదటిదానిగా ఎన్నుకొన్న ఘట్టాలుకూడా అనేకం... అందుకనే శ్రీపతి, అతనిలాటి అనేకమంది ఇతర యువకులూ తన దర్శనంకోసం పనికట్టుకొని ఆ వీధివెంట ఒకటికి పదిసార్లు తిరగడంకూడా తను కనిపెడుతున్న విషయమే! తను శివరాత్రి తిరణాలకు వెళ్ళినప్పుడు గుంపులుగుంపులుగా తన వెంటబడ్డ యువకుల్ని చూసి- తన ఆకర్షణశక్తికి తను ఎంతగా గర్వపడలేదు! ఈనాడు ఇరవైఐదు నిమిషాలు ముందుగా స్టేషనుకువచ్చి ప్లాటుఫారంమీద ట్రంకుపెట్టెల మీద కూర్చొనివుండగా పత్తికాయల్లాటి జతలకళ్ళతో తన శరీరంలోని ఒంపుల్ని ఎంతమంది గమనిస్తూ తన్మయత్వం పొంది ఉంటారో తనకు తెలియకపోలేదు. అసలు పరపురుషుడి తీక్షణ వీక్షణాలు తనకు ములుకుల్లాగ తోస్తయ్. కాని శ్రీపతిలాటి నాగరికతా యువకుడి చలవచూపుల్ని తను అడ్డగించదు సరికదా- పైపెచ్చు అధికంగా కోరుతుంది.

కింది కంకరనూ, పక్కనువున్న టెలిగ్రాఫ్ స్తంభాల్నీ, పచ్చనిపైర్లనూ వెనక్కు నెట్టుకుంటూ- దూరానవున్న తాటితోపులవైపు రైలు వడివడిగా పరుగెత్తుతోంది. గాలికి శ్రీపతి క్రాపంతా రేగి ... అతని ఫాలభాగం మీద నాట్యం చేయసాగింది. కాని అతను దీన్ని గమనించకుండానే చదువు ధ్యానంలో పడివున్నాడు.

రాధ మనస్సు పరిపరివిధాల పోయింది... అందాన్ని నిర్లక్ష్యతతో చూసే వ్యక్తుల్లో శ్రీపతిలాటి నవనాగరికతా యువకుడికి స్థానం ఉండటం చాలా శోచనీయంగా తోచింది.

గాలికి రెప రెపా కొట్టుకుంటూన్న జాకెట్‌కాలర్లు ఆమెకు వీవనలయ్యాయ్. ముంగురుల్ని గాలితో రేపుకుంటూ పమిటచెరగును భుజాలకు దట్టంగా చుట్టుకొని సర్దుక్కూర్చున్నా శ్రీపతి మాత్రం పోతపోసిన విగ్రహంలాగు ఉన్నాడు: కొద్ది కోపంతోనే

ఆమె తకీమని ఇంజన్‌వైపు తిరిగి కూర్చుంది..... కాని ఇంజనువాడు క్రూరంగా పంపిన రవ్వ ఆమె తలను మళ్ళీ శ్రీపతి వైపుకే తిప్పింది.

శ్రీపతి తల యెత్తకుండానే సిగరెట్టు ముట్టించాడు. రాధ తన పక్కనుంచి పాకిపొయ్యే ప్రకృతి దృశ్యాలను కూడా చూడలేకపోయింది. ఆమె భౌతిక నయనాలు బైటికి చూస్తున్నా - ఆమె మనస్సులోని ఆలోచనలు కట్టలు తెంచుకున్న ప్రవాహంలాగు శ్రీపతివైపే నిరాటంకంగా పరుగెత్తు తున్నయ్. మొదట్లో ఎలా కూర్చుని పుస్తకం పట్టుకున్నాడో- అదేవిధంగా కూర్చున్నాడు. స్టేషన్‌లు అన్నీ వెనుక దిగపడిపోతున్నా అతనికి తెలియటం లేదేమో?

అతను తనను పలకరించి మాటలు కలుపుకొని తనకు కాలక్షేపం అయ్యేట్టు ప్రయత్నించకూడదూ? ప్రవరుడిలాగు బిగతీసుకు కూర్చుని ఎవర్ని సాధిస్తాడు? తనుకూడా చదువుకొన్నదే ననీ, నాగరికతా, సభ్యతా అంటే తనక్కూడా తెలుసుననీ- తన కట్టూబొట్టూ చెప్తూనే ఉన్నయ్. మరి అతను తనలాటి అందాలరాశిని గమనించక పొయ్యేందుకు- గుడ్డివాడు కాడుగా: సౌందర్యంతో గర్వించి ఉన్న తన హృదయాన్ని గాయపరుస్తే అతని కేమొస్తుంది?

"ఆ.... పొగ కొంచెం అటువదుల్తారూ?" తనకు తెలియకుండానే ఆ మాటల్ని అంది. నిజానికి శ్రీపతి కాల్చే సిగరెట్టు పొగ తనకు ఎంత మాత్రమూ అపాయకరంగా లేదు. శ్రీపతి తల యెత్తకుండానే అంతకుముందే ముట్టించిన సిగరెట్టును అవతల పారేశాడు. తన మాటలు అతన్ని గాయపరిచినై కాబోలు: తను ధైర్యం చేసి మాట్లాడినా మూగనోముపట్టి కూర్చున్నాడు: తను అందగాడనే గర్వంతోనే నిర్లక్ష్యంగా కదలక, మెదలక బిగతీసుకు కూర్చున్నాడు కాబోలు:

ఆమె బద్ధకంగా ఒళ్ళు విరుచుకొని, తన చూపుల్లోనే హృదయా న్నంతటినీ ఇముడ్చుకొని చూసింది... పుస్తకం మీది దృష్టితోనే శ్రీపతి చిరునవ్వు నవ్వాడు... ఎందుకు నవ్వాడూ? తనను కనిపెట్టే! ఎన్ని కళ్ళున్నై అతనికి; మంచి రసికుడు!

కాని కథకుడు నవ్వించినా- తన ప్రతిభా విశేషమనే భ్రమపడ్డ రాధకు సానుభూతి చూపే వాళ్లెవరు?

అసలు తను కొంత బెట్టు చేస్తేనే కాని - ఘట్టంలో పట్టు ఉండదని అతని ఉద్దేశం కాబోలు: అదైనా ఎంతసేపు? తన అందం ముందు తలవాల్చే పురుష జాతికేగా శ్రీపతి చెందేది? స్త్రీని దీక్షగా చూడటం నేటి సభ్యతా ప్రపంచానికి విరుద్ధమని- తను కూర్చున్న స్థలాన్ని శూన్యంగా భావించాడా? ఐనా తనుమాత్రం తక్కువ తిందా యేమిటి? ఆశయాల్నీ కోర్కెల్నీ ఓర్పుతో హృదయాంతరాళంలో దాచుకోగలశక్తి - పురుషుడికన్న స్త్రీలోనే ఎక్కువ వుందనే సిద్ధాంతాన్ని అత నెప్పుడూ వినలేదు కాబోలు:

నాగరికతోద్ధారణకు నడుంకట్టిన శ్రీపతిలాటి యువకుల స్నేహాన్నే తను కోరింది... అందుకు సభ్యత పెట్టని ఆనకట్టయింది అసలు. ఆ పెట్టెలో ఇంకెవరున్నారనీ అతను సభ్యతకు భయపడటం? చినగంజాం స్టేషన్‌లో బట్టలమూటతో సహా దిగిపోయిన సాహుకారు- బండి కదిలేటంత వరకూ- అమావాస్య చంద్రబింబాన్ని తలదన్నే ముఖమండలంలోంచి చిరునవ్వును ఒలకబోసుకుంటూ కనురెప్ప వాల్చకుండా తనవైపు చూడలా? మరి శ్రీపతో? సాయిబ్‌గారు ఇంకా కలలు కంటున్నారాయె! ఇంక తనూ, అతనే జాగ్రదావస్థలో ఉన్న ప్రయాణీకు లైనప్పుడు- అతనికి ప్రయాణీకుల సభ్యత యేమిటో తెలుసునని తనెల్లా అనుకోగలదు?

రైలు మరి రెండు స్టేషన్లు దాటింది...

శ్రీపతి సిగరెట్ కాల్చుకుందామని సిగరెట్ పెట్టెతీసి ఒకసారి ఆమెవైపు చూశాడు. ఆమె అభ్యంతరం జ్ఞాపక మొచ్చేప్పటికి సిగరెట్ పెట్టె స్వస్థానాన్ని జేరింది.

ఇదిచూసి రాధ నొచ్చుకుంది. తోడి ప్రయాణీకుడి అలవాటును అభ్యంతరపెట్టే అధికారాన్ని రైలు కంపెనీవాళ్ళు తనకు ఇవ్వకపోయినా - తను అమలు జరిపించింది. ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ముక్కుపొడుం మానని తన భర్తను ఏం చెయ్యలేకపోయినా పరపురుషుణ్ణి ఆజ్ఞాపించ గలిగింది. పాపం అతన్ని ఎంత గాయ పరిచిందో?

“ఫరవాలేదు... కాల్చుకోండి” అంది.

పుస్తకం మీది అతని దృష్టికూడా అందుకు కృతజ్ఞతను తెలుపలేదు. అసలు తను దయదల్చి ఆ మాటను అనటమే పొరపాటు: మొదట అనటమూ, తరువాత ఉపసంహరించుకోటమూ, రెండు తప్పులు: నాలిక కొరుక్కుంది.

“మీరు ఎందాక వెళ్తారూ?” అంది మళ్ళీ.

ఈ రెండునాల్కల మనిషినైనా పరికించి చూడకుండానే శ్రీపతి, ‘మెద్రాస్-’ అన్నాడు. తను ఎంత చొరవచేసుకున్నా అతను దాన్ని ఉపయోగించుకోలేకపోవటం తన తప్పెలా అవుతుంది?

ఒంగోలులో బండి ఆగింది. సాయిబుగారు తటాలున లేచి.... బెడ్డింగు చంకన పెట్టుకొని వెళ్ళిపొయ్యాడు.

శ్రీపతికూడా పుస్తకం మూసి ట్రంకు మీద పెట్టి దిగి వెళ్ళాడు. తను తప్ప ఆ పెట్టెలో ఇంకెవరూ లేరుకదా... పోనీ తన సామానుల్ని చూస్తూండమని చెప్పి వెళ్ళకూడదూ? ఎన్ని అవసరమైన పనుల్నయినా నిర్లక్ష్యంగా పరిగణించటమే అతని విచిత్రవ్యక్తిత్వం కాబోలు!

శ్రీపతిని ఆకర్షించి, అతన్ని తన చుట్టూ తిప్పుకుంటూ ఏడిపించి- తను నవ్వుతూంటే ఎంత తృప్తిగావుంటుంది! అందకుండా వున్న వస్తువువైపే బలంకొద్దీ చెయ్యిజాపే మానవ స్వభావం- ఆమె ప్రవర్తనలో అబద్ధమవలేదు.

## 2

బండి బయలుదేరినా శ్రీపతి రాలేదు. దిగిపొయ్యాడేమో? లేక ఇంకో పెట్టెలో ఎక్కాడా? ఆమె ఆతృతతో చూడసాగింది.

ప్లాటుఫారం చివర సాగిపోతూన్న బండిలో ఎక్కి అతను చివరిదమ్ముతో సిగరెట్ పారేశాడు. బండి సాగిపోతూండగా ఎక్కటం ఎంత ప్రమాదం! శ్రీపతే తన భర్త అయివుంటే యీ క్షణంలో ఆమె అతని మీద కారాలూ, మిరియాలూ నూరి బుగ్గలు మెలేసి ఇకముందు అల్లాటి అపాయకరమైన పనిని చెయ్యనని ప్రమాణం చేయించితీరేది!

అతను యథాస్థానాన్ని ఆక్రమించి మళ్ళీ పుస్తకం తెరిచి చదువులో నిమగ్నమయ్యాడు: అతని ఎర్రని పెదవులకు తమలపాకులు రంగువేసి తనను ఆహ్వానిస్తున్నయ్... తన జాకెట్ మడతలూ, చీరకుచ్చెళ్ళూ, చెదిరిన ముంగురులూ అతన్ని ఆహ్వానించటంలా? కాని తను రూపించుకుంటూన్న విషయాన్నే శ్రీపతి రూపించుకో లేకపోవటం ఆశ్చర్యమే!

ఏమైనా గట్టిప్రయత్నం చేసి తీరాలనే దృఢనిశ్చయం తోనే రాధ "ఆ చదివేది ఏమిటండీ?" అని అడిగింది.

ఒక్క క్షణం ఆమె వైపు 'నీకెందుకూ?' అన్నట్టు చూసి శ్రీపతి, "గాల్స్‌వర్దీ" అని సమాధానమిచ్చాడు.

అది ఘనపదార్థమో, ద్రవపదార్థమో, వాయుపదార్థమో... నదో, పర్వతమో, జంతువో... యేమిటో కూడా ఆమె ఫిఫ్తుఫారం తెలివితేటలకు అందకపోయినా, తెలిసినట్టుగా కళ్లు తిప్పింది.

ఆ పెట్టెను తామిద్దరే స్వంతం చేసుకొన్నా తను ఎంత చొరవచేసి మాటలు కలుపుకుంటూన్నా... సిగ్గుపడుతూన్న వాడల్లే మూతి బిగించుకొని కూర్చోవటం ఏమంత విశేషమని పైవాళ్ళు అనుకుంటారు? అనుభవం లేకుండా సిగ్గుపడే పురుషుణ్ని చూసి స్త్రీ జాలిపడుతుం దనుకోవటం... శుద్ధ అబద్ధమనే విషయం శ్రీపతి బుల్లి బుర్రకు ఎక్కడా తగిలినట్టు లేదు.

నెల్లూరులో టికెట్ కలెక్టరు స్నేహితు డొకడు వచ్చి శ్రీపతిని పలకరించాడు.

"ఎందాకా?"

"మెడ్రాస్–"

"లా పూర్తవలా?"

"ఆఖరు సంవత్సరం–"

ఆమె - దూరం నుంచే వాళ్ళ ప్రసంగాన్ని పాము చెవుల్ని ఉపయోగించి వింటోంది.

"కాపరంతోనేనా?"

"ఉహూం...."

"ఏడ్వాన్- మీ మిసెస్సా?" ఆమె వైపు చూశాడు. శ్రీపతి ఏం సమాధానం చెప్తాడోనని ఆమె ఆతృతగా చూడసాగింది.

"ఛా! పరాయ్‌పిల్ల-" శ్రీపతి కొద్ది కోపంతోనే ఇంగ్లీషులో అన్నాడు. ఆమె ఫిఫ్తుఫారం తెలివితేటలు యీ భాషను అర్థం చేసుకున్నై - అవునని శ్రీపతి అంటే ఎంత బాగుండేది!

"కోతలు మానెయ్-" అన్నాడు టికెట్ కలెక్టర్ అనుమానం తీరని చూపు చూస్తూ. లోకం ఏవిధంగా తామిద్దర్నీ భార్యాభర్తలుగా పరిగణిస్తుందో శ్రీపతికి అర్థమవలేదు.

"ఆమె ఏమన్నా అనుకుంటుందనన్నా ఉండాలి-" అన్నాడు శ్రీపతి విసురుగా. టికెట్ కలెక్టరు చల్లగా జారుకున్నాడు. బండికూడా కదిలింది. రాధకు రొమాన్సు అంటే కథల్లో చదివినంత తేలిగ్గా మాత్రం కన్పించలేదు. గూడూరు వచ్చేదాకా తన సూక్ష్మబుద్ధి నంతట్నీ ఉపయోగించి రాధ అనేక పన్నాగాల్ని పన్నాలనుకుంది. తన దృష్టిలో ప్రాణం లేని శరీరంలాగు శ్రీపతి ప్రవర్తించటం అప్పటికైనా మానుతే తృప్తిపడేది!

గూడూరులో ఒక పావలాకు పళ్ళుకొని - పళ్ళవాడికి ఐదురూపాయిల నోటిచ్చింది.

"చిల్లర లేదు-" అన్నాడు వాడు.

"మీ దగ్గర చిల్లర వుందా?" శ్రీపతి వైపు చూస్తూ అడిగిందామె. శ్రీపతి తల ఎత్తాడు. ఆమె విజయసూచకంగా నవ్వింది.

"లే-దు."

బండి కదిలింది. "దుడ్డు కుడమ్మా-" అని పళ్ళవాడు అరుస్తున్నాడు. ఆమె ఏమీ పాలుపోక బిత్తరచూపులు చూడసాగింది.

శ్రీపతి ప్రమాదాన్ని అర్థంచేసుకున్న వాడల్లే- నవ్వుకొని- తన జేబులోంచి పావలా తీసి ప్లాటుఫాం మీదికి విసిరి పళ్ళవాణ్ని వదిలించాడు.

"చాలా శ్రమ ఇచ్చాను" అంది ఆమె నవ్వుతూ.

"ఫరవాలేదు లెండి."

గూడూరులో ఎక్కిన అరవాయన- అటు చివర్నవున్న సీటులో జేరి కూనిరాగాలు తీస్తూ, తాళం వేయసాగాడు.

ఆమె బత్తాయి తొనల్ని శ్రీపతివైపు తోస్తూ, నాజూకుగా "పుచ్చుకోండి-" అంది.

"ఒద్దండీ-" అన్నాడు శ్రీపతి.

అరవాయన రాగాలు మాని, ఈ భాష రానందుకు తనలో తను బాధపడుతూ- ఎదురుగా ఉన్న 'దొంగలున్నారు- జాగ్రత్త!' అనే మాటల్ని అర్థం చేసుకోలేక లొట్టలేస్తున్నాడు.

ఆమె బలవంత పెడుతూన్నట్టు, "ఫరవాలేదు తీసుకోండి-" అంటూ శ్రీపతివైపు తొనల్ని తోసి కొంటెగా నవ్వింది.

శ్రీపతి ఇంక బాగుండదన్నట్లు తీసుకొని తన భాగంలోని సగపాలు అరవాయనకు అర్పించుకున్నాడు. నాయుడిపేటలో అరవాయన దిగిపోతూ "మీ దంపతులికి నా అభినందనాలు-" అని ఆంగ్లంలో అన్నాడు.

శ్రీపతికి చాలా కోపంవచ్చింది. ఏ లెక్కనుపట్టి తమను దంపతుల్లాగా వీళ్ళు పరిగణిస్తున్నారు? ఆమె పకాలున నవ్వింది. శ్రీపతి ఏమీ ఎరగనట్టుగా ముఖం పెట్టుకొని కూలబడ్డాడు.

"ఆయన అన్నది ఏమిటండీ?"

శ్రీపతి చాలా ప్రమాదావస్థలో పడ్డాడు. "ఏదో యింగ్లీషులో అన్నాడు-"

"అదే- ఏమిటీ?" తనకు ఆంగ్లభాషతో అసలు పరిచయమే లేనట్టు నటించటం ఆమె ఎత్తుకు మరోమెట్టు:

"పొరపాటున-" అని ఆగి శ్రీపతి చెప్పటమా, మానటమా అనే ఆలోచనలో పడ్డాడు.

'చెప్పండి' అన్నట్టు చూసింది ఆమె.

"పొరపాటున... మీ దంపతులకు... నా అభినందనాలు... అన్నాడు..." ఇంతతోనైనా ఆమె వదులుతుందని శ్రీపతి యీ మాటల్ని అన్నాడు.

ఆమె తలవొంచుకుని సిగ్గును నటిస్తూ చిరునవ్వు నవ్వింది. రైలుకు ఇదేమీ పట్టనట్టు - కూతవేసి బయలుదేరింది. ఇతర ప్రయాణీకు లెవరూ ఆ పెట్టెలో ఎక్కపోవటం శ్రీపతికి చాలా ఇబ్బందైన విషయమై పోయింది.

మరొక ఐదునిమిషాలు గడిచాక - వాలుజడను వక్షం మీదినుంచి జార్చి రిబ్బన్ను మునివేళ్ళతో సర్దుకుంటూ ఆమె "మీకు పెళ్ళయిందా?" అని సమాధానం కోసం విలాసంగా చూసింది.

శ్రీపతి పై చూపుల్తో "లేదు" అన్నాడు. ఆమె కొద్దిగా శ్రీపతివైపుకు జరిగి కూర్చుని మరికొన్ని కొత్త సిద్ధాంతాల్ని తయారు చేసుకుంది. అందులో ముఖ్యమైంది 'బ్రహ్మచారి

శతమర్కటః' అన్నది- శ్రీపతి మీద పనిచేస్తున్న విషయం. రెండోది స్త్రీ స్పర్శ ఎరగని శ్రీపతిని ఆకర్షించేందుకు ఎక్కువ శ్రమ అనవసరం!

"ఈ నోటు మార్చి మీ డబ్బులు తీసుకోండి-" అని పాత బాకీని ఇచ్చేసేందుకల్లే నోటును అతని వైపు జాచి పట్టుకుంది.

"ఒద్దులెండి-"

"తీసుకోండి-" లేకపోతే తను అమితంగా బాధపడాల్సి వుంటుందన్నట్టు కంఠంపెట్టింది. శ్రీపతి మాట్లాడలేదు.

గాలికి రెపరెపా కొట్టుకుంటూన్న నోటును గురిచూసి సరిగ్గా పెట్టెలోనే పడేట్టుగా వదిలింది. శ్రీపతి అదిరి- ఆ నోటు ఎవరికీ కాకుండా గాలిదేవుడి పాలవుతుందేమోనని చప్పున తనచేతిని వేశాడు. వెంటనే ఆమె కూడా అతనిచేతి మీద తన చేతిని వేసింది. ఈ రొమాన్సుతో శ్రీపతి హూణాహూణమై పోతున్నాడు. ఆమె తన నీడకన్నా ఘోరంగా వెంటబడటమే అతనికి భరించరానిదైంది... వెంటనే తన చేతిని ఉపసంహరించుకొని, "నోటుకాస్తా ఎగిరిపొయ్యేది-" అన్నాడు.

"మీరు తీసుకోక పోబట్టే-"

"మీరు వదలబట్టే-"

మరి మాటల్లేవు. తన బుర్రంతా పాడుచేసుకొని, మెదడంతా కరిగేట్టు ఆలోచించి పన్నిన వలలన్నీ పటాపంచలౌతున్నయ్. సూళ్ళూరుపేట కూడా దాటి రైలు మెడ్రాస్ వైపుకు పరుగెత్తుతోంది. మరికొన్ని నిమిషాల్లో ఎవరిదారి వారిది! తనలాటి సుకుమార గాత్రుల మీద ఇంత నిగ్రహమూ, మొండితనమూ ప్రయోగించటం ఏమంత కీర్తి తెచ్చే విషయం? ప్రవరుడు నిరాకరించిన వరూధినీ, అర్జునుడు నిరాకరించిన ఊర్వశీ.... వాళ్ళ వేదన యేమిటో రాధకు ఇప్పుడు బాగా అర్థమైంది.

సెంట్రల్-!

ఆమె నిరాశతో నిట్టూర్చింది.

"కొంచెం కూలీని పిలిచిపెడతారూ?"

మామూలు ధోరణిలోకి గొంతుకూడా మార్చుకుంది.

"కూలీ... కూలీ..."

కూలివాడొకడువచ్చి ఇద్దరి సామానుల్నీ కలిపి ఎత్తుకోబొయ్యాడు. తామిద్దర్నీ కూలి వెధవదగ్గర్నుంచీ 'ఏకం'గా పరిగణించటం... శ్రీపతికి చాలా కష్టంగా తోచింది.

"అవ్వి కాదు- ఇవ్వి" అన్నాడు శ్రీపతి... విసుగుతో ఆమె సామానుల్ని మాత్రమే చూపుతూ.

ఇంతలోనే "హల్లో–" అనుకుంటూ మూర్తి వచ్చాడు: ఆమె ముఖం వికసించింది.

"ఏం అన్నయ్యా?"

"నీ కోసమే!.... ఏంరా శ్రీపతీ?"

"ఆఁ...ఆఁ..." అన్నాడు శ్రీపతి బెదురుగా. మూర్తి ఆమె సోదరుడని తెలిశాక– శ్రీపతి కొంచెం కంగారుపడ్డాడు. ఆ పెట్టెలో వారిద్దరే ప్రయాణీకులు. మూర్తి ఏమనుకున్నాడో? ఏమయినా తన తప్పు ఏమాత్రమూ లేదుగా!

రాధకు ఇది ప్రోత్సాహాన్నే ఇచ్చింది. అన్నగారి స్నేహితుణ్ని వశం చేసుకోవటం తేలికేననిపించింది.

"వీరెవరన్నయ్యా?"

"స్నేహితుడు... క్లాసుమేటు–"

"నాకు చాలా సహాయం చేశారు. ఒంగోలులో భోజనం కూడా తెప్పించి ఇచ్చారు–"

నాగరికతా జాణల్ని కని విని ఎరుగని శ్రీపతికి చిరుచెమట్లుపోశాయ్. కొన్ని క్షణాలపాటు అతని ముఖం వివర్ణమైంది.

"అన్నయ్యా! వార్ని మనింటికి 'టీ'కి పిలు–"

మూర్తి తల ఆడించి– "మా సిస్టరోయ్–" అని ఆమెను కొత్తగా పరిచయం చేస్తూ, "సాయంత్రం మా ఇంటికి తప్పకుండా టీకి రావాలి–" అన్నాడు.

శ్రీపతి లోలోపల చీదరించుకున్నా పైకి, "అల్లాగే" అన్నాడు తప్పనిసరిగా. ఆమె ఆ అంగీకారానికి మరింత సంతోషపడ్డది.

"వెళ్ళొస్తాం–" అని మూర్తి సోదరితో సహా కదిలాడు. ఆమె వెనక్కు తిరిగి కొంటిగా బుగ్గలు సొట్టలు పడేట్టు శ్రీపతి వైపు చూచి నవ్వింది. శ్రీపతి నిట్టూర్చి, 'మూర్ఖురాలు' అని గొణుక్కుని, మెల్లిగా లాడ్జి జేరుకున్నాడు.

ఇంతకూ ఆశ్చర్యపడాల్సిన విషయమేమంటే– శ్రీపతి రాకకోసం రాధ తను మెద్రాస్‌లో వున్న ఇరవై సాయంత్రాలూ ఎదురుతెన్నులు చూస్తూనే వుంది. అతను రాకపోయినా నిరాశపడనేలేదు. ఎప్పుడో ఒకనాడు తనకోసం వచ్చి తనను పూజిస్తాడనే ఆమె నమ్మకం.... కాముకులు అనుకూల వాతావరణాన్ని కల్పించుకొని ఎంతకూ నిరాశ పడకపోవటం యీ నాటికీ కొత్తకాని విషయమని ఆమెకు మాత్రం తెలియదు!

*– జనవరి, 1942*